శుక్రవారం 28.08.2026

వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)

### తుమ్మిడిహెట్టిపై

# 1న ఢిల్లీలో కీలక భేటీ

### నేడు ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 27 :** తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబరు 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతర ప్రయత్నాల నేపథ్యంలోనే సీడబ్ల్యూసీ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మహారాష్ట్ర గతం లో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 150 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టును నిర్మించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తున్న విషయం విదితమే. 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే... మళ్లీ పంపింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, 150 మీటర్ల ఎత్తుతో అయితేనే గ్రావిటీ ద్వారా నీటిని తరలించవ్చని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనాల ప్రకారం 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కట్టినా.. అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్రం, మహారాష్ట్రతో రాష్ట్ర ప్రభుత్వం వరుసగా సంప్రదింపులు జరుపుతోంది. దాని ఫలితంగానే సెప్టెంబరు 1న కీలక సమావేశం ఢిల్లీలో జరగనుంది. ఈ నేపథ్యంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీపై శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించనున్నారు. నీటి లభ్యతతోపాటు ఇతరత్రా అంశాలపై సమీక్షించి, ఢిల్లీలో జరిగే సమావేశంలో అనుసరించాల్సిన విధానంపై అధికారులకు దిశానిర్దేశనం చేయనున్నారు. అలాగే, కృష్ణా ట్రైబ్యునల్‌లో అనుసరించాల్సిన అంశాలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్‌తోపాటు న్యాయవాదులతో సీఎం సమావేశం కానున్నారు.

# ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ ఎపిసోడ్

**ఏ నిర్ణయమైనా స్వాగతిస్తాం**

**కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవు**

**కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదు**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**



**నిజామాబాద్, ఆగస్టు 27:** మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ స్పష్టం చేశారు. అధి ష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఆటో డ్రైవర్లకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్

**పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు చర్యలు**



**హైదరాబాద్, ఆగస్టు 27:**

ఆటో డ్రైవర్లకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఎలక్ట్రిక్‌గా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఉద్యోగులతో పెట్టుకుంటే అంతే

**సీఎం రేవంత్ మీద గౌరవంతో ఓపిక పట్టాం**

**మంత్రులను ఎన్ని సార్లు కలిసినా ప్రయోజనం లేదు**

**ప్రభుత్వంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు**

**సీపీఎస్ రద్దు సహా సమస్యలన్నింటినీ పరిష్కరించాలి**

**సెప్టెంబరు 1న కలెక్టరేట్ల వద్ద నిరసన 10న లక్షల మందితో చలో హైదరాబాద్**

**మహాధర్నాలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్**




**హైదరాబాద్ :** ప్రజాప్రభుత్వం అని చెప్పుకొంటున్న రేవంత్ సర్కారు.. ప్రజల్లో భాగమైన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావులు ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం.. ఉద్యోగులను తీవ్ర అశాంతికి గురిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి మీద ఉన్న గౌరవంతో ఇంత కాలం ఓపిక పట్టామని.. ఆయన సూచన మేరకు మంత్రులను, అధికారుల కమిటీని పలుమార్లు కలిసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని చెప్పారు. ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. డిమాండ్ల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉద్యోగుల జేఏసీ మహాధర్నా చేపట్టింది. 33 జిల్లాల్లోనూ ఉద్యోగులు, పింఛనర్లు ధర్నాలు చేశారు. పీఆర్సీ ప్రకటించాలని, కరువు భత్యం బకాయిలు మంజూరు చేయాలని, నూతన ఆరోగ్య బీమాను సమర్థంగా అమలు చేయాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాలో జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ.. కొత్త పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పదించకపోతే సెప్టెంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని, సెప్టెంబరు 10న లక్షలాది మందితో చలో హైదరాబాద్ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివ్ష?సరావు మాట్లాడుతూ.. పీఆర్సీ అమలు, డీఏ బకాయిల విషయంలో సర్కారులో కనీస చలనం లేదన్నారు. మహా ధర్నా ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని, డిమాండ్లను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మహాధర్నా విజయవంతమైందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాలో చావా రవి(యూటీఎఫ్), రవీందర్ రెడ్డి(ట్రెసా), సదానంద్ గౌడ్ (ఎస్టీయూ), ముజీబ్(టీఎన్జీవో), బి.శ్యామ్ (టీజీవో),మధుసూదన్‌రెడ్డి(టీజీఎల్ఏ), దాస్యనాయక్(క్లాస్-4) పాల్గొన్నారు

## మళ్లీ తెరపైకి

# పునర్విభజన

**వర్షాకాల సమావేశాలు ప్రొరోగ్ కాలేదు**

**మళ్లీ సమావేశాలు జరపటం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది**

**పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు**

**నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్రం కసరత్తు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 27 :** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించకపోవడం (ప్రొరోగ్ చేయకపోవడం) వెనుక పెద్ద వ్యూహమే ఉందనే చర్చ నడుస్తోంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. మరోవైపు, డీలిమిటేషన్‌పై ప్రభుత్వానికి ఉన్న ప్రణాళికలను ప్రతిపక్షాలతో పంచుకోవాలని, మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లను పెంచవద్దని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే గురువారం ఒక లేఖ రాశారు. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీల లో జరిగిన వరుస ఫిరాయింపుల నేపథ్యంలో, వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుందని ఊహాగానాలు వచ్చాయి. కానీ, కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమంతో వెనక్కి తగ్గినట్లు ప్రచారం జరిగింది. అయినప్పటికీ, డీలిమిటేషన్ బిల్లు కోసం కసరత్తును కేంద్రం ఆపలేదని, పూర్తి మెజారిటీని సాధించేందుకు పావులు కదుపుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కిరెణ్ రిజిజు వ్యాఖ్యలు, మోదీకి ఖర్గే లేఖ రాయడం.. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఓ ఇంటర్వ్యూలో మంత్రి కిరెణ్ రిజిజు మాట్లాడుతూ.. పార్లమెంట్‌ను మళ్లీ సమావేశపరిచే అవకాశం ఉందనే సంకేతాలు ఇచ్చారు. వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయే తప్ప, అధికారికంగా ప్రొరోగ్ కాలేదని ఆయన గుర్తుచేశారు. 'హౌస్‌ను ప్రొరోగ్ చేయనప్పుడు, సమావేశాల్ని మళ్లీ జరపటం పెద్ద కష్టమేమీ కాదు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది' అని తెలిపారు. ప్రత్యేక సమావేశాల నిర్వహణపై నేరుగా స్పందించనప్పటికీ.. 1952 నుంచి మన దేశ పార్లమెంటు చరిత్రలో ఇలాంటి సందర్భాలు అనేకం ఉన్నాయని ఆయన పేర్కొనటం గమనార్హం. గత ఏప్రిల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ రాక వీగిపోయిన డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను మళ్లీ ఇదే సెషన్‌లో ముందుకు తెస్తారనే ప్రచారం జరుగుతోంది. వచ్చే 25 ఏళ్ల వరకు లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచవద్దని, రాష్ట్రాల వారీగా ప్రస్తుత ప్రాతినిధ్యాన్నే కొనసాగించాలని ప్రధాని మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. డీలిమిటేషన్ అంశంపై చర్చించేందుకు వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

**పెద్ది సుదర్శన్ రెడ్డి**

**సంతాప సభలో ఘనంగా నివాళులు**

**వాస్తవం : భూపాలపల్లి**



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభను గురువారం నిర్వహించారు. వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ లోక్‌సభ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గాల బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజల కోసం పనిచేసిన తీరు ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. నిబద్ధతతో ప్రజా సేవ చేయడం వల్లే ఆయన ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలకు గుర్తింపుగా మెడికల్ కాలేజీకి ఆయన పేరు పెట్టడంతో పాటు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించాలని నాయకులు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి సేవలను స్మరించుకోవాలని ఆకాంక్షించారు.

## రసాయన రహిత సాగుకు

# జీవన ఎరువులు దోహదం

**వ్యవసాయ అధికారిని డి. అరుణ కుమారి**



**వాస్తవం : మాడుగుల**

మాడుగుల మండలంలోని ఇర్విన్ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వరిలో భాస్వరం కరిగించు జీవన ఎరువు వాడడం దాని వల్ల కలిగే లాభాలు.వరిలో కలిగే చీడపీడల యాజమాన్యం ట్రైకోడెర్మా విరిడి వాడకం దానివల్ల కలిగే లాభాలు గురించి రైతులకు వివరించడం జరిగింది ఇందులో భాగంగా రైతులు 100 కిలోల మాగిన పశువుల పేడలో రెండు కిలోల పిఎస్బి చల్లి దాన్ని ఒక 15 రోజులు చెట్టు నీడలో తట్టుబొంతలు కప్పి తేమ ఉండేలా నీళ్లు చల్లుతూ ఉంచినట్టయితే దానిలో బాసరము కలిగించే జీవన ఎరువు మొత్తం 100 కిలోల పేడలో తయారై వాడటానికి సులువుగా మారుతుందని దీనివల్ల ఎండు తెగులు కలిగించే బ్యాక్టీరియాని ఈ బ్యాక్టీరియా తిని వేస్తుంది కావున జీవ నియంత్రణ జరుగుతుంది. దీనివల్ల వాతావరణ కాలుష్యం లేకుండా రైతుకి లాభదాయకంగా ఈ పి ఎస్ బి ఉపయోగపడుతుందని అదేవిధంగా ట్రైకోడెర్మా విరిడి కూడా వేరుశనగ ఇతర పప్పు జాతి పంటల్లో సమర్థవంతంగా ఎండు తెగులును తట్టుకుంటుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అరుణకుమారి, రైతులు సూదిని వెంకట్ రెడ్డి, అల్లాజీ,,గణేష్,ఎల్లయ్య,వార్డ్ మెంబర్లు నరేష్,రాములు పాల్గొన్నారు .

# ఓటర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**గ్రామ సర్పంచ్ ఇంద్రకరణ్ రెడ్డి**

**వాస్తవం : నిర్మల్**



నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా, నిర్వహించిన సమావేశంలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలపై గ్రామ సర్పంచ్ చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ నిబంధనలు చట్టబద్ధమైన మార్గదర్శకాలకు అను గుణంగానే ఈ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ ప్రక్రియ పై పలు సూచనలు చేస్తూ ప్రతి ఇంటింటికి నోటీసులు అందజేయాలి నోటీసులు అందుకోవడానికి ఓటర్లు ఇబ్బందులు పడకుండా, అధికారులు లేదా సిబ్బం ది స్వయంగా ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి నోటీసులు చేరేలా చూడాలి.ప్రతి ఓటరు సమ స్యను పరిష్కరించాలి ఓటర్ల జాబితాలో ఉన్న పొరపాట్లను సరిచేస్తూ, ఏ ఒక్క అర్హులైన ఓటరుకు అన్యాయం జరగకుండా న్యాయం చేయాలి. ఓటర్లు కేంద్రానికి రాకపోయి నా వారి వద్దకే వెళ్ళి పరిశీలన జరపాలి. చట్టబద్ధమైన నిర్వహణ నిబంధనలు మార్గ దర్శకాల ప్రకారం ప్రక్రియను పూర్తి పార దర్శకంగా నిర్వ హించి, ఓటర్ల హక్కులను కాపాడాలి అని పేర్కొన్నారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ ఆశ వర్కర్లు ,అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ముందస్తు రక్షా బంధన్ వేడుకలు



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు రాఖీలు కట్టుకుని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్ మాట్లాడుతూ…రక్షా బంధన్ భారతీయ సంస్కృతిలో సోదర, సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మేకల పద్మ, కోరెపు శ్రీనివాస్, చింతల హరిష్మ, దుంపెట మమత, పాల్గొన్నారు.అలాగే చందుర్తి మండల నర్సింగాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెరుక గంగరాజు , చింతకుంట గంగాధర్, మెరుగు భాస్కర్ పాల్గొన్నారు.అలాగే చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల, విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చందుర్తి మాజీ ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి,వార్డు సభ్యులు అత్తెన మహేందర్, హరిబాబు, మదన్, మేడిశెట్టి శ్రీహరి, చిలుక రాము, మర్రి రాజు, మెంగని వివేక్ పాల్గొన్నారు.

# లింగాపురం పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ



**చర్ల : వాస్తవం**

చర్ల మండలం లింగాపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రి పంపిణీ చేశారు. దాత పరుచూరి మనోహర్ ప్రసాద్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీకోసం మేమున్నాం టీం చైర్మన్ లయన్ నీలి ప్రకాష్, బండారి రామకృష్ణ, గొట్టిపాటి శ్రీనివాసరావు, దొడ్డి సూరిబాబు, వంగా సత్యనారాయణ, ఆవుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ తడికల నరేష్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ స్వరూప, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నరేంద్రబాబు, కొంగూరు సత్యం, తడికల విజయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ.. తాను బాల్యంలో చదువుకున్న పాఠశాలను మరువకుండా గత 10 సంవత్సరాలుగా ప్రతి ఏటా ఏదో ఒక సేవ అందిస్తున్న దాత పరుచూరి మనోహర్ ప్రసాద్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరూ స్పందించి తమ వంతుగా వెనుకబడిన ప్రాంతాల పాఠశాలలకు సేవలు అందించాలని కోరారు.

# ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

**వాస్తవం : నిర్మల్ :**



ముధోల్ నియోజకవర్గంలోని బైంసా పట్టణంలో వాసవి హైస్కూల్లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని విద్యార్థుల్లో కుటుంబ బంధాలను పరస్పర ప్రేమ, ఆప్యాయత, విలువలను పెంపొందించేలా విద్యార్థులు ఉండాలని ఉపాధ్యాయులు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు రాఖీ పౌర్ణమి ప్రాధాన్యతను వివరిస్తూ . అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే ప్రేమాను రాగాలు, ప్రత్యేకత నిలిచి పండుగ పట్ల ప్రతి ఒక్కరు సాంస్కృతి సంప్రదాయాలను భావి చారాలకు తీసుకువెళ్లాలని మహిళల పట్ల తోటి ఆడపడుచుల పట్ల ఏ రకంగా గౌర వించాలి సమాజంలో మహిళలకు యొక్క ప్రాధాన్యతను గురించి పలు ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రాజేశ్వర్ మాట్లా డుతూ.. విద్యతో పాటు విద్యార్థులకు కుటుంబ విలువలు, మానవీయ సంబంధాల ప్రాధాన్యతను తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైన్స్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**అవినీతి ఆరోపణలపై 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు**

**వాస్తవం : భూపాలపల్లి**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయంలో అవినీతి, అక్రమ వసూళ్లకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు గురువారం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. జిల్లా సహాయ సంచాలకులు బొజ్జ జయరాజ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ బోడుప్పల్‌లోని ఆయన నివాసంతో పాటు భూపాలపల్లి కలెక్టరేట్‌లోని మైన్స్ ఏడీ కార్యాలయంలో అధికారులు రికార్డులను పరిశీలించారు. సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లోని బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ సోదాలు చేపట్టినట్లు తెలిసింది. భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జయరాజ్ ఇసుక అక్రమ రవాణాదారులతో కుమ్మక్కై అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆదా యానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. మైన్స్ కార్యాలయంలోని ఫైళ్లు, అనుమతి పత్రాలు, ఇసుక రవాణాకు సంబంధించిన దస్త్రాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలో పనిచే స్తున్న ఓ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సోదాల్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు, బినామీ ఆస్తులకు సంబం ధించిన వివరాలు లభించినట్లు తెలుస్తోంది. అయితే వీటిపై ఏసీబీ నుంచి అధికా రికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా జయరాజ్ అవార్డు అందుకున్న కొద్ది రోజులకే ఆయనపై ఏసీబీ సోదాలు జరగడం విశేషం.

# ఇల్లంద కాకతీయ పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు



**వాస్తవం : వర్ధన్నపేట**

వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలోని కాకతీయ పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థినులు తమ సోదరులైన విద్యార్థులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని ఆప్యాయత, సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం రాఖీ పౌర్ణమి విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ గొడిశాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్**

**వాస్తవం : బెజ్జంకి ఆగస్టు 27**



అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర 3వ మహాసభలు యాదగిరిగుట్టలో జరుగుతున్న నేపథ్యంలో ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ యువతకు పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు బోనగిరి శ్రావణ్ తో కలిసి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలి లేదా నిరుద్యోగులకు నెలకు రూ.5,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు.యువజన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభలు ఒక వేదికగా కానున్నాయని ఇట్టి మహాసభలను రాష్ట్రంలో ఉన్నటు వంటి యువత అత్యధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల అధ్యక్షుడు అంతటి రాకేష్, ఉపాధ్యక్షులు రోడ్డ లక్ష్మణ్, శంకర్, మధు, సుమంత్, వడ్లూరి మల్లేశం, రమేష్ పాల్గొన్నారు.



వాస్తవం



# భైరాన్ పల్లి అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి :ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**రజాకార్ల దాడులను ఎదురొడ్డిన యోధులకు ఘన సన్మానం**

**అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులు అర్పించారు**



వాస్తవం : మద్దూరు

దూళ్మిట్ట మండలంలోని చారిత్రక భైరాన్‌పల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్తూపానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఆయన స్మరించుకున్నారు. అనంతరం చారిత్రక బురుజును సందర్శించిన ఎమ్మెల్యే.. రజాకార్ల దాడులను ధైర్యంగా ఎదురొడ్డి పోరాడిన యోధులను, అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. భైరాన్‌పల్లి చరిత్ర తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీక అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్మ రాజమల్లయ్య, దూళ్మిట్ట, మద్దూరు బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు మంద యాదగిరి, మేక సంతోష్,మాజీ ఎంపీపీ బద్దిపడిగే కృష్ణారెడ్డి,సర్పంచులు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ శ్రేణులు అమరవీరుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పీఆర్సీ, పాత పెన్షన్, ఆరోగ్య పథకం సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టరేట్ ఎదుట టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా**



వాస్తవం : భూపాలపల్లి

భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్ బూరుగు రవి మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత పాలకులు ఉద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీఆర్సీ అమలు చేస్తామని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికే ముప్పై నెలలు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు. మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగుల బేసిక్ పే నుంచి నెలనెలా ఒకటిన్నర శాతం చొప్పున మినహాయింపు చేస్తున్నప్పటికీ ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా ఆరోగ్య పథకానికి సంబంధించిన సమస్యలు కొనసాగుతున్నాయని, అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆరోగ్య పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి గుర్తింపు పొందిన అన్ని ఆసుపత్రుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 25 పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీఓ 317 ప్రకారం పెండింగ్‌లో ఉన్న స్పౌస్ బదిలీలను వెంటనే చేపట్టాలని, స్థానికత ఆధారంగా జీఓ నంబర్ 190 ప్రకారం డిప్యూటేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుభాకర్ రెడ్డి, డీఆర్ మధుసూదన్, శ్రీనివాసరావు, రాజకుమార్, తిరుపతి, అజహర్, శ్రీనివాస్, శ్రీదేవి, ప్రవీణ్, సాంబశివరావు, కిరణ్‌కుమార్, నక్క తిరుపతి, ఏ. దశరథ రామారావు, షఫీ అహ్మద్, జ్ఞానేశ్వర్‌సింగ్, మురళీధర్ రెడ్డి, కుమారస్వామి, మందల రవీందర్ రెడ్డి, లక్ష్మణబాబు, చిలువేరు అశోక్, తిరుపతిరెడ్డి, సేవానాయక్, కుర్రే ప్రవీణ్‌కుమార్, రమేశ్ నాయక్, రాచర్ల శ్రీనివాస్, స్వాతి, మల్లీశ్వరి, దిల్షాద్, భార్గవ్, బోనాల రాజమౌళి, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బిట్స్‌లో ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



వాస్తవం : భూపాలపల్లి

భూపాలపల్లి పట్టణంలోని బిట్స్ పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణకు ప్రతీకగా రాఖీలు కట్టుకున్నారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రంగురంగుల రాఖీలను ప్రదర్శించి తమ స్నేహితులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బాలాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడంతో పాటు విద్యార్థుల్లో ప్రేమ, ఐక్యత, సోదరభావం వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ మార్గరేట్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య పరస్పర భరోసా, బాధ్యతలకు ప్రతీక అని పేర్కొన్నారు. అక్కచెల్లెళ్ల కష్టసుఖాల్లో అన్నదమ్ములు పాలు పంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లయ్యకుంట చెరువు మరమ్మతుకు అటవీ శాఖ అధికారులకు వినతి



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం దేవుని తండా గ్రామంలోని ఎల్లయ్యకుంట చెరువు గండిపడి తెగిపోయే ప్రమాదం ఉందని, దాని అత్యవసర మరమ్మతుల కోసం మట్టిని కేటాయించాలని కోరుతూ అటవీ శాఖ అధికారి భూలక్ష్మి ని గ్రామ సర్పంచ్ భూక్యా మోహన్, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు భూక్యా గబ్బర్ సింగ్ గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ చెరువు గ్రామానికి తాగునీరు, వ్యవసాయ సాగునీరు అందించడంతో పాటు వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, చెరువు తెగిపోతే తీవ్ర నష్టం జరుగుతుందని అధికారులకు వివరించారు. ఈ వినతిపై అటవీ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించి, మట్టి కేటాయింపునకు హామీ ఇచ్చారు.

# మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో సృజన లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



వాస్తవం : అమీన్ పూర్

అమీన్ పూర్ లో ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ చొరవతో బీరంగూడ సిఎంసి డివిజన్ పరిధిలోని సృజన లక్ష్మీ నగర్ కాలనీలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అమీన్ పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి గతంలో అమీన్ పూర్ సర్కిల్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయగా, వాటిలో భాగంగానే సృజన లక్ష్మీనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో శశిధర్ రెడ్డి గురువారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. త్వరలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం కానున్నందున పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి కాలనీవాసులకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, మంత్రి వివేక్ వెంకటస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.




# అసలైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చేలా చూడాలి

## రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అంది బీరన్న

వాస్తవం : శేర్లింగంపల్లి

హైదరాబాదులో గురువారం రోజు ఆలిండి యా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ అంది బీరన్న మాట్లాడుతూ...... కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డబల్ బెడ్ రూములు అర్హుల కే ఇవ్వాలని కోరుతూ వే లాదిమం ది నిరుపేదలు కూరగాయలు అ మ్ముకుంటూ చిన్న చిన్న వ్యాపారా లు చేస్తూ ఎక్కడ దరఖాస్తులు పెట్టుకోవాలో తెలువక ఇబ్బందు లు పడుతున్నారు.రాజకీయాలు చేయకుం టూ అసలైన లబ్ధిదారుల కు ఇల్లు వచ్చేలా చూడాలని ప్రభు త్వాన్ని కోరడం జరిగింది.ఈ సమా వేశంలో గవ్వల శివశం కర అధ్యక్ష న అధ్యక్షు తన వయస్సు అట్టడు గు పేద ప్రజ లకు గుర్తించి అధికారు లతో సర్వే చేయించి లబ్ధిదారులకే కేటాయించాలని కోరుతూ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యకర్తలు సుభాష్ చంద్రబోస్ ఆశయం కోసం ఈ దేశంలో ఈ రాష్ట్రం లో దేశం కోసం ఈ సమాజం కోసం నిరంతరం పో రా టం చేస్తూ ఉన్నారు కాంగ్రెస్ ప్రభు త్వం ఆలోచన చేసి గ్రేటర్ హై దరా బాదు లో అనేకమంది పేదలు రోడ్లపై గాంధీ హాస్పిటల్ దగ్గర స్టేషన్ రైల్వే స్టేషన్ దగ్గర అక్కడ కృడ అనేక మంది పేదలు బుక్కె డు తిండి కోసము ఇబ్బందు లు పడుతున్నారు.




ప్రభుత్వం గు ర్తించి అనాధలకు ఒక ఒక పెద్ద ఆశ్రయం కట్టించి వాళ్ళందరికీ భోజనం పెట్టే బాధ్య త ప్రభుత్వం తీసు కోవాలి ఎమ్మె ల్యేలకు ఎంపీల కు గెస్ట్ హౌస్ ఉంటాయి కానీ పేద వానికి బుక్కడు తిండి ఉండదా ప్రభు త్వం ఏం చేస్తుం ది తక్షణమే అక్క డక్కడ ఉన్న వార్డులలో అధి కారులతో ప్రజాప్రతినిధులతో సర్వే చేయించి అనాధలు అందరికీ ఒక పెద్ద గోదాం గట్టి వాళ్ళందరినీ ఆద రించి మూడు పూటల భోజనం పెట్టాలని కోరుతూ ఈ సమావేశం లో రాష్ట్ర నాయ కులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కుప్పాడి సంగీత, బి. సత్యజి.ని ర్మలమ్మ,పి.శోభ,కమర్‌బేగం,మునిబి తవి తార్ తదితరులు షేరిలిం గంపల్లి నియోజకవర్గం నుంచి పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనాలు ఒకేరోజు జరగాలి



## ఉత్సవ కమిటీ సమావేశంలో చైర్మన్ వైస్ చైర్మన్

వాస్తవం : అందోల్

గణేష్ నిమజ్జనాలు ఒకే రోజు జరిగేలా ఉత్సవ కమిటీ సభ్యు లు సహకరించాలని అందోల్ జోగిపేట మునిసిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి చిట్టిబాబులు పేర్కొన్నారు. గణేష్ ఉత్స వ కమిటీ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. దీనికి వివిధ పార్టీల నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో వారు మాట్లాడుతూ ఇష్టానుసారంగా వినాయక నిమజ్జనాలు చేస్తే ఊరికి అరిష్టమవుతుందని అం దుకే అందరూ సమిష్టి కృషితో ఒకేరోజు నిమజ్జనాలు జరిగే లా చూసుకోవాలని తెలిపారు. దానికి ఉత్సవ నిర్వాహకులు డెకరేషన్లు ఇబ్బంది అవుతుందని బ్యాండు మేళాలు దొరకమ ని పలు పలు విధాలుగా మాట్లాడడంతో చైర్మన్ కల్పించుకొని నవరాత్రులు భక్తిశ్రద్ధ లతో జరగాలని డెకరేషన్ లో ఏముం దని భక్తి భావనల లు నెలకొల్పాలని తెలిపారు. ఉన్నదాం ట్లోనే సరిపెట్టుకుని బాలవినాయకులను సెప్టెంబర్ 23 , అంటే తొమ్మిది రోజులు, పెద్దవి నాయకులను సెప్టెంబర్ 25 అంటే 11 రోజులకు నిమజ్జనాలు చేయాలని తీర్మానించారు. దీంతో అందరూ ఏకీభవించారు, ఈ కార్యక్రమంలో అందోల్ మాజీ ఎంపీపీ రామా గౌడ్ బిజెపి రాష్ట్ర నాయకులు ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు చిట్టిబాబు, రాజశేఖర్, అరుణ్ కుమార్, పట్లోళ్ల శీను, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీణ్ కుమార్ దుర్గేష్, అల్లే శ్రీకాంత్, ప్రదీప్ గౌడ్ నాయకులు సునోత్తం రెడ్డి, కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వీరబైరాన్‌పల్లి పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

## రజాకారుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 118 మంది అమరవీరులకు ఘన నివాళి

వాస్తవం : మద్దూరు

వీరబైరాన్‌పల్లి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్,మండల అధ్యక్షులు కోడం యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మా రావు, కప్పర ప్రసాద్, బీజేపీ అధికార ప్రతినిధి కేవీఎల్ఎన్ రెడ్డి,బల్ల శ్రీనివాస్ కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాస్, కో-కన్వీనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. 1947 ఆగస్టు 27న రజాకారుల దాడిలో వీరబైరాన్‌పల్లిలో 118 మంది ప్రాణాలు కోల్పోయార ని తెలిపారు. నిజాం, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరే కంగా తెలంగాణ ప్రజలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని పేర్కొన్నారు. రజాకారుల దాడులను ధైర్యంగా ఎదుర్కొన్న వీరబైరాన్‌పల్లి ప్రజల పోరాటం, అమరవీరుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన కొనసాగిందని తెలిపారు. తెలంగాణ విమోచన పోరాటంలో వీరబైరాన్‌పల్లి ఘటన విషాదకరమైనదైనా, ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సి న బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు.సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ



విమోచన పోరాట చరిత్రను, స్వాతంత్ర్య సమరయోధులు, అ మరవీరుల త్యాగాలను విస్మరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వి మోచన దినోత్సవానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరా రు.మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ.. తెలంగాణ వి మోచన పోరాట చరిత్రను వాస్తవాలతో ప్రజలకు తెలియజే యాల్సిన అవసరం ఉందన్నారు. కప్పర ప్రసాద్ మాట్లాడు తూ చారిత్రక ఆధారాలతో నాటి సంఘటనలను భావితరాల కు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసి సన్మానించారు. నాటి ఘటనలను ప్రత్యక్షంగా చూసిన పెద్దలను కలిసి అప్పటి పరిస్థితులను తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాలకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని నాయకులు కోరారు. వీరబైరాన్‌పల్లి అమరవీరుల త్యాగం చిరస్మరణీయం. వారి పోరాట స్ఫూర్తి భావితరాలకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పించారు.

# ఉప్పరపల్లిలో ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమం



వాస్తవం : చెన్నారావుపేట

ఉప్పరపల్లి బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో, అలాగే జడ్పీహెచ్ఎస్ మరియు ప్రాథమిక పాఠ శాలల్లో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంగేం శంకర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఈదునూరి విజయ్ కుమార్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు కాసాని కరుణాకర్, నవీన్ల రాజు, మద్ది మల్లేశం, గుల్లపల్లి వెంకన్న, రెడ్డబోయిన ధర్మ, బొర్పట్ల రమేష్, మెరుగు కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సంగేం శంకర్ మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ కేవలం అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక మాత్రమే కాకుండా, పరస్పర రక్షణ, బాధ్యత, ఆప్యాయతలకు ప్రతీక అని అన్నారు.నేను నీకు రక్షణ.. నువ్వు నాకు రక్షణ.. మనిద్దరం ఈ దేశానికి శ్రీరామ రక్ష" అనే భావనతో ప్రతి ఒక్కరూ సమాజం పట్ల తమ బాధ్యతను గుర్తించి, దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ఆయన అన్నారు.రక్షాబంధన్ పండుగ మన భా రతీయ సంస్కృతి, సోదరభావం మరియు కుటుంబ విలువల ను ప్రతిబింబిస్తుందని పేర్కొంటూ, భారతీయ సంస్కృతి వైభ వాన్ని కొనియాడారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ రసాబాస

## కాంగ్రెస్ బిజెపి నాయకుల మధ్య తోపులాట

వాస్తవం : రుద్రంగి

రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపి ణీ కార్యక్రమం నిర్వహించగా రసాభాసగా మారింది ప్రధాన మంత్రి మోడీ ఫోటో రేషన్ కార్డుపై లేకపోవడంతో బిజెపి నాయకులు నిరసనకు దిగారు.ఉచిత రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేషన్ కార్డులపై రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటో పెట్టి మోడీ ఫోటో ఎందుకు పెట్టలేదని ఎమ్మెల్యే ను



ప్రశ్నించారు.దీంతో కాంగ్రెస్ బిజెపి నాయకుల మధ్య గొడవ జరిగింది ఒకరికొకరు పార్టీ నినాదాలు చేస్తూ తోసుకున్నరు. పోలీసులు కలుగచేసుకొని ఇరు పార్టీల నాయకులకు సర్దిచెప్పారు.

# కళ్ళకల్ గ్రామంలో ఓటరు జాబితాపై ప్రత్యేక గ్రామసభ

## సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్

వాస్తవం : మనోహరాబాద్

మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజుగౌడ్,ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముసాయిదా ఓటరు జాబితాపై గ్రామస్థులకు వివరించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన గ్రామసభలో ఓటరు జాబితాను ప్రజల సమక్షంలో పరిశీలించారు.జాబితాలో పేర్లు,వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కుకు అర్హత సాధించిన యువతీ యువకులు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి ఓటు కీలకమని,అర్హులందరూ ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని



గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్,వార్డు సభ్యులు సాయం బాబు,ఇర్ఫాన్,స్వామి,రాజశేఖర్ రెడ్డి,నాయకులు శ్రీశైలం,సర్విన్ గౌడ్,అన్వర్,ఉమర్,వీఆర్వో వేణు,ఆశ వర్కర్లు,అంగన్వాడి టీచర్లు,అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు..

# జిహెచ్ఎంసి పెత్తనం మున్సిపల్ వేతనం

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

వాస్తవం: రాజేంద్రనగర్

గ్రేటర్ లో మూడు కమిషనరేట్లను ఏర్పాటు చేసినప్పటికీ జిహెచ్ఎంసి పెత్తనం చలాయిస్తూ కార్మికులకు మున్సిపల్ వేతనాలు చెల్లించడం సిగ్గుచేటని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. గురువారం తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ కే. ఏసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు రెండవ పిఆర్సిని అమలు చేయడం లేదని అన్నారు. గ్రేటర్లో విలీనమైన మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులకు జిహెచ్ఎంసి వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ లో కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. పర్మినెంట్ చేసేంతవరకు 26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని సూచించారు. జీతాలను పెంచాల్సిన ప్రభుత్వాలు జీతాలను తగ్గించడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం మున్సి




పల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జయపాల్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో సీఎం స్థాయి నుండి ఎమ్మెల్యే వరకు లక్షలలో జీతాలు తీసుకుంటున్నారని తెలిపారు. పాలకుల జీతాలు తగ్గించకుండా కార్మికులకు ఉన్న జీతాలను తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతి అంశంలోనూ కార్మికులకు న్యాయపరంగా అందాల్సిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున సమ్మెలు చేయడానికి కూడా వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పి. వెంకటయ్య, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఏఐ-ఆధారిత చర్మ క్యాన్సర్ నిర్ధారణపై పరిశోధన

## పీహెచ్.డీ. పట్టా అందుకున్న డాక్టర్ శ్రీలక్ష్మి

వాస్తవం : పటాన్ చెరు

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని శ్రీలక్ష్మి చెరుకూరి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డెర్మోస్కోపిక్ ఇమేజ్ విశ్లేషణను ఉపయోగించి చర్మ క్యాన్సర్ గుర్తింపు కోసం ఆప్టిమైజ్ ఎన్సెంబుల్ డీప్ లెర్నింగ్ మోడల్స్ రూపకల్పన, అభివృద్ధి'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.డి.వి. ప్రసాద్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, చర్మ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించడంలో సహాయపడటానికి కచ్చితమైన, అర్థమయ్యే, విశ్వసనీయమైన కృత్రిమ మేధస్సు-ఆధారిత ఫ్రేమ్ వర్కును అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఈ పరిశోధన, ఆటోమేటెడ్ చర్మ క్యాన్సర్ నిర్ధారణలో ఎదురయ్యే క్లాస్ అసమతుల్యత, మల్టీ-క్లాస్ వర్గీకరణ, మోడల్ ఆప్టిమైజేషన్, ఓవర్ ఫిట్టింగ్ వంటి అనేక కీలక సవాళ్లను పరిష్కరిస్తుందన్నారు. ఈ పరిశోధన ఇంకా, లెసియన్ సెగ్మెంటేషన్, క్లినికల్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (సీడీఎస్ఎస్)ను చేర్చిన ఒక త్రీ+దీూ--ఆప్టిమైజ్డ్ ఎన్ సెంబుల్ ఫ్రేమ్ వర్కును పరిచయం చేస్తుందన్నారు. ప్రతిపాదిత ఈ ఫ్రేమ్ వర్కు, కచ్చితమైన, నమ్మకమైన, పారదర్శకమైన రోగనిర్ధారణ మద్దతును అందించడానికి రూపొందించినట్టు తెలిపారు. ఇది చర్మ క్యాన్సర్ ను ముందుగానే గుర్తించడంలో ఆరోగ్య సంరక్షణ నిపుణులకు సహాయపడటానికి, రోగ నిర్ధారణలో ఉండే వైవిధ్యాలను తగ్గించడానికి, వైద్య విధానంలో విశ్వసనీయమైన ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు.



డాక్టర్ శ్రీలక్ష్మి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

# ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ నేత



వాస్తవం : రుద్రంగి

రుద్రంగి మండలకేంద్రనికి చెందిన మహ్మద్ సదుల్లా,హసీనా ,రీమ్స్,హసీనా గత నాలుగు రోజుల క్రితం కారు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను గురువారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు.ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ కుటుంబానికి మనోధైర్యం కలిపించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, కంటె రెడ్డి,గంగం మహేష్, దయ్యాల కమలాకర్, దయ్యాల నారాయణ, ఉప్పులుటి గణేష్,సింగారపు గంగారెడ్డి, కదాస్ లక్ష్మణ్, తర్రె గంగారెడ్డి, కోడిగంటి శ్యామ్,గంటె ప్రశాంత్, రగుట్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడు ఇనగాలకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



వాస్తవం : హనుమకొండ

రక్షాబంధన్ మహోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి బ్రహ్మకుమారీస్ సోదరీమణులు రాఖీ కట్టారు.హనుమకొండ రామకృష్ణ కాలనీలోని ఆయన నివాసానికి గురువారం విచ్చేసిన బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఇనగాలకు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పరమాత్మ శివబాబా ఈశ్వరీయ ఆశీస్సులు, ప్రసాదాన్ని అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని, ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.అనంతరం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి బ్రహ్మకుమారీస్ సోదరీమణులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం..నిండు ప్రాణం బలి



వాస్తవం : లక్ష్మణ చందా

లక్ష్మణ చందా మండలం నర్సాపూర్ గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం 2.30 నిమిషాల సమయములో ఖానాపూర్ నుండి నిర్మల్ వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల అదుపు తప్పి రోడ్డుకు కుడివైపున ఉన్న పంట పొలాల్లో పడిపోయింది ఇందులో ఎనిమిది మంది ప్రయాణికులు ఉన్నారు వీరిని వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు 108 అంబులెన్స్ లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది ఇందులో రెండు నెలల 15 రోజుల పిల్లవాడు నాలుగు గంట సమయంలో చనిపోవడం జరిగింది ఇరువురికి గాయాలు అయినవని ఎస్సై శ్రావణి గారు తెలపడం జరిగింది ఈ ఆటోలో గాంధాల వెన్నెల ఆరోహిని వర్షిక (జగిత్యాల్)జాజిమొగ్గ శిరీష ప్రాణను చింటూ(దస్తురాబాద్) మహమ్మద్ రషీద్ ఆటో డ్రైవర్ మహమ్మద్ సయాన్(ఖానాపూర్) మొదలగువారు ఆటోలో ప్రయాణించడం జరిగింది.

# చెట్టుకు రాఖీ కట్టి ప్రకృతిపై ప్రేమను చాటిన విద్యార్థులు



వాస్తవం : ఎల్కతుర్తి

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సెయింట్ థామస్ ఆల్ఫిట్యూడ్ పాఠశాలలో రాఖీ పండుగ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సోదరభావంతో పాటు ప్రకృతి పరిరక్షణపై చక్కటి సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని "నాకు నువ్వు రక్ష.. నీకు నేను రక్ష.. మనం ఇద్దరం దేశానికి రక్ష" అనే సందేశంతో సోదర భావాన్ని చాటుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని చెట్టుకు రాఖీ కట్టి, పర్యావరణాన్ని సంరక్షించాలనే తమ బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. చెట్లు మన జీవితానికి ఎంతో అవసరమని, స్వచ్ఛమైన గాలి, నీడతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చెట్లను కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని పిలుపునిచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ పుష్కరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. రాఖీ పండుగను ప్రకృతి పరిరక్షణతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థులు సమాజానికి గొప్ప సందేశాన్ని అందించారని కొనియాడారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతా భావాన్ని పెంపొందించడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతితో పాటు ఉపాధ్యాయినులు అంబాల లావణ్య, సరిత, ఆశా బేగం, సుమలత, లలిత, మమత, కవిత, గీత, నవ్య, స్వప్న, మౌనిక, రచన, భవాని, రమ్య మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేటు వైద్యశాలల తనిఖీలు



వాస్తవం : సిరిసిల్ల

సిరిసిల్ల పట్టణం లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, రోగులకు అందుతున్న సౌకర్యాలు, ఆసుపత్రి నిర్వహణ తీరును పరిశీలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి ఎంజెలా ఆల్ఫ్రెడ్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ ... ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్నవారు తప్పని సరిగా జిల్లా వైద్య శాఖ కార్యలయం నుండి అనుమతి తీసుకోవాలని, అలాగే నిర్వాహకులు వారు అందిస్తున్న సేవలకు తీసుకుంటున్నరుసుముల వివరాలను, స్థానిక భాషలో ఆసుపత్రి ఆవరణలో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు, హాస్పిటల్స్ కి వస్తున్న డాక్టర్ల కన్సల్టేషన్ వివరాలను అందరికీ కనపడే విధంగా, బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ లేని వారికి, నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం, చట్టరీత్యా చర్య తీసుకోబడుతుందని, హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పిసిపిఎన్డిటి చట్టం నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని పుట్టబోయే బిడ్డ ఆడ, మగ తెలుసుకోవడానికి వస్తే వారి వివరాలను తెలియజేయాలని ఒకవేళ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సెక్షన్ ఇంచార్జి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు అందుకోవాలి

## తహశీల్దార్ కనకయ్య



వాస్తవం : చిగురుమామిడి

దేశంలో అర్హత ఉన్న ప్రతీ పౌరుడు ఒకే ఓటు హక్కు కలిగి ఉండాలని చిగురుమామిడి తహశీల్దార్ కనకయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటర్ల ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ కనకయ్య ఓటర్ల జాబితా వివరాలు వెల్లడించారు, ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. చట్ట ప్రకారం దేశంలో ప్రతీ పౌరుడికి ఒకే ఓటు హక్కు ఉండాలని, రెండు ఓట్లు కలిగి ఉండడం నేరమని స్పష్టం చేశారు. గ్రామంలో డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించామని గ్రామంలో 204 మందికి నాన్ మ్యాపింగ్ ఓట్లు జరిగాయన్నారు. వీటికి సంబంధించి గ్రామంలో నోటీసులు అందించి సంబంధిత ఓటర్లకు నోటీసులు ఇచ్చామన్నారు. ఈ నోటీసులు అందిన 142 మంది ఓటర్లు సంబంధిత ఆధారాలతో తహశీల్దార్ ముందు హాజరుకాగా, సరైన వివరాలు అందించని వారికి, అందుబాటులో లేని వారికి నోటీసులు జారీ చేశామన్నారు. నేటి నుండి అక్టోబర్ 17వ తారీఖు వరకు మండలంలోని అన్ని గ్రామాలలో హియరింగ్ నిర్వహిస్తామన్నారు. అక్టోబర్ 19వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల అవుతుందన్నారు. చిన్న చిన్న తప్పులు, పేర్లు చిరునామా లేదా కుటుంబ సభ్యుల ఓట్లను ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చుకోవడానికి ఫారం-8 ని నింపి సంబంధిత అధికారికి లేదా బిఎల్ఓకు ఇచ్చిసరిచేసుకోవాలన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేది వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు కొరకు ఫారం-6 నింపి ఓటరు జాబితాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ గ్రామ సభ సమావేశానికి గ్రామ సర్పంచ్ చింతపుల నరేందర్, ఆర్ఐ నాగరాజు, జిపిఓ బాలయ్య శ్రీనివాస్, బిఎల్ఓలు కుట్ల విజయ, మవురవ్వ, లక్ష్మి, వార్డు మెంబర్లు ఓటర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువత కోసం క్రీడా ప్రాంగణం ఏర్పాటు



## సర్పంచ్ శనిగరం సత్యనారాయణ

వాస్తవం : మద్దూరు

మండల పరిధిలోని నర్సాయపల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణం లేని లోటును గుర్తించిన గ్రామ సర్పంచ్, మద్దూరు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు శనిగరం సత్యనారాయణ గ్రామ యువత కోసం ప్రత్యేకంగా క్రీడా స్థలాన్ని కేటాయించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో వాలీబాల్ కిట్‌ను సైతం అందజేశారు. కేటాయించిన స్థలంలో వాలీబాల్ కోర్టును శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన నెట్ స్తంభాల నిర్మాణం, లైన్ మార్కింగ్ తదితర పనులను పూర్తి చేశారు. గ్రామ యువతకు క్రీడల్లో పాల్గొనేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం పట్ల క్రీడాకారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణం, వాలీబాల్ కిట్‌ను అందించిన సర్పంచ్ శనిగరం సత్యనారాయణకు నర్సాయపల్లి గ్రామ యువకులు కృతజ్ఞతలు తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించే ఈ కార్యక్రమం అభినందనీయమని గ్రామ యువ క్రీడాకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువ క్రీడాకారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల మహాధర్నా విజయవంతం

## ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



వాస్తవం : సిరిసిల్ల

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కమిటీ చైర్మన్ మారం జగదీష్, కన్వీనర్ ఏలూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహాధర్నాలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్ కుమార్, జిల్లా కన్వీనర్ సయ్యద్ జబీ ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయ గేట్ ఆవరణలో నిర్వహించిన మహాధర్నాకు గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా నూతన పీఆర్ సి ప్రకటించడం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయడం, పెండింగ్ బిల్లులను చెల్లించడం, ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయడం వంటి ఐదు ప్రధాన డిమాండ్ లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సెప్టెంబర్ 10న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం ద్వారా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో జేఏసీ నాయకులు గాజుల సుదర్శన్, బొల్లం సాగర్, మెట్ట శ్రీకాంత్, మొహమ్మద్ రియాజ్, జి.శ్రీనివాస్ రావు, రాంనాథ్ రెడ్డి, మధుసూదన్ రావు, సదానందం, సుధాకర్ రెడ్డి, బాల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, హరికిషన్, నయిమొద్దీన్, లాల శ్రీనివాస్, మోతీలాల్, పురుషోత్తం, కృష్ణప్రసాద్, కొమ్ము రమేష్, సాయికిరణ్, విశ్వన్, రామస్వామి, సురేష్, ప్రవీణ్, అనిల్, మహేందర్ రావు, బి శ్రీనివాస్, శివసాయి, ఆర్ శేఖర్, లక్ష్మణ్, తదితర వివిధ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



వాస్తవం : వరంగల్ ప్రతినిధి

హనుమకొండ జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ స్పెషల్ ఇన్సెన్టివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాలను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 49వ డివిజన్ వార్డ్ సభల పరిశీలన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 49వ డివిజన్‌లోని రామాలయం మరియు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్సీ, ఎస్టీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్డ్ సభలను (ఓటరు నమోదు, సవరణ కేంద్రాలు) ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని అన్నారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు, సమన్వయకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగపురి కిరణ్, మాజీ కార్పొరేటర్ రామ్ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామంలో జరిగిన ప్రత్యేక గ్రామ సభకు జిల్లా కలెక్టర్ తో పాటు హాజరయ్యారు. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్రీమతి ఛాహత్ బాజ్‌పాయ్ తో కలిసి ఓటరు జాబితాలోని అభ్యంతరాలు, చేర్పులు, మార్పులపై స్థానిక ప్రజలతో చర్చించారు. కొత్త ఓట్ల నమోదు, ముసాయిదా జాబితాలోని మార్పులకు సంబంధించి గ్రామస్తులు లేవనెత్తిన పలు సందేహాలను అధికారుల సమక్షంలో నివృత్తి చేశారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా అర్హులైన ఏ ఒక్కరికీ ఓటు హక్కు దూరం కాకుండా చూడాలని, మరణించిన వారి మరియు డూప్లికేట్ ఓట్లను పూర్తి నిబంధనల ప్రకారం తొలగించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను, రెవెన్యూ అధికారులను కోరారు.

# లైంగిక దాడి కేసులో మరో నిందితుడు అరెస్ట్



వాస్తవం : రామచంద్రపురం

రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్లోని కాళికా మాత గుడి వద్ద మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు నమోదు (జతీ. చీఠీ. 505/2026) చేసిన అనంతరం దర్యాప్తును వేగవంతం చేసిన అధికారులు, ఇప్పటికే ప్రధాన నిందితులైన వడ్ల సాయన్న అలియాస్ సాయిలు, బిల్లె రవిలను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పటాన్‌చెరు మండలం, కర్దనూర్ గ్రామానికి చెందిన వడకట్టు వీరభద్ర స్వామి (56) ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. శ్రీనివాస్ నగర్ కాలనీలోని కాళికామాత గుడిలో పూజారిగా పనిచేస్తున్న వీరభద్ర స్వామికి, సాయన్నతో గత 30 ఏళ్లుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో గుడి వద్దకు వస్తూ పోతున్న మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. తేదీ 27.02.2025 నాడు వీరభద్ర స్వామి, సాయన్న ఇద్దరూ కలిసి ఆ బాలికను యాదగిరిగుట్టకు తీసుకెళ్లి, అక్కడ ఒక గదిని అద్దెకు తీసుకుని ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు తేలింది. దీంతో వీరభద్ర స్వామిని అరెస్ట్ చేసిన పోలీసులు ఆయనను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. రామచంద్రాపురానికి చెందిన కరికే సత్యనారాయణ అనే వ్యక్తి కూడా సదరు మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. ప్రస్తుతం సత్యనారాయణ పరారీలో ఉండటంతో, అతని ఆచూకీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయని రామచంద్రాపురం సబ్ డివిజన్ ఏసిపి తెలిపారు.

# చందుర్తి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ కళ్యాణ మండపంలో గురువారం ఎమ్మార్పీఎస్ మండలం నూతన కమిటీని ఎంపిక చేశారు. బస్టాండ్ చౌరస్తా నుండి దప్పులతో ఊరేగింపుగా కళ్యాణ మండపానికి వచ్చి ఎమ్మార్పీఎస్ చందుర్తి మండల ఇంఛార్జి తర్రె శంకర్ మాదిగ అధ్యక్షతన నూతన కమిటీని జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కమిటీ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చందుర్తి మండల అధ్యక్షులుగా కట్కూరి ప్రశాంత్ మాదిగ, అధికార ప్రతినిధిగా కొమ్ము సాగర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఆవునూరి రాజు మాదిగను నియమించారు. ఉపాధ్యక్షులుగా లింగంపల్లి అర్జున్ మాదిగ, కన్నం దేవరాజు మాదిగ, లింగంపల్లి శంకర్ మాదిగలను, కార్యదర్శిగా అక్కెనపల్లి రాజేందర్ ను నియమించినట్లు జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మార్పీఎస్ ఆశయాల సాధనకు కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవునూరి ప్రభాకర్ మాదిగ, ఖానాపురం లక్ష్మణ్ మాదిగ, చిలుక అంజిబాబు, మోకనపల్లి దేవరాజ్, ఎలగందుల బిక్షపతి మాదిగ, బహుజన గర్జన గజ్జల అశోక్ మాదిగ, శోభరాణి, దొబ్బల ఆనంద్, ఉమ్మడి జిల్లా ఎంఎస్ఎఫ్ కన్వీనర్ నవీన్, నరేష్ మాదిగ, సోషల్ మీడియా ఇంచార్జ్ జింక శ్రీధర్ చందుర్తి మండల అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, మాదిగ కుల సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భూభారతి సమగ్ర 22 ఏ, రీ సర్వే పై వీడియో కాన్ఫరెన్స్



## పాల్గొన్న జిల్లా కలెక్టర్

వాస్తవం : వరంగల్ ప్రతినిధి

రాష్ట్రంలో భూభారతి, 22-ఏ, సమగ్ర రీ-సర్వే అంశాలపై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరయ్యారు. భూభారతి డేటా ఆధారంగా ఎక్కడైనా 22-ఏ ఎక్స్ టెంట్‌లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారువ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22-ఏ కింద నమోదైన భూములను గుర్తించి, నిర్దేశిత ప్రొఫార్మాలో తహసీల్దార్ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను దేశించారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ ఓ పి) అమలు చేయాలని తెలిపారు. ఎస్.ఆర్.ఓ లో వచ్చిన ఫిర్యాదులను రోజువారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీ-సర్వే నిర్వహించాలని, వాటి సత్ఫలితాల ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేపడతామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. సంధ్యారాణి, డి.ఆర్.ఓ విజయలక్ష్మి, సెక్షన్ సూపరింటెండెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలి

## జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్



వాస్తవం : పెద్దపల్లి ప్రతినిధి

పెద్దపల్లి జిల్లాలోని వివిధ పత్రికలు, టీవీ ఛానళ్లలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీని వాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జిల్లాలో ఎంతోకాలంగా జర్నలిస్టులుగా పనిచే స్తున్న వారికి కనీస వేతనాలు కూడా లేకపోవడంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాయని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్ర జల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు నిరంతరం పని చే స్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివించడం ఆర్థికంగా భారంగా మారిందన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని ఇప్పటికే వివిధ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసు కోలేదని ఆరోపించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న నేపథ్యంలో, ఈ నెల 31వ తేదీలోగా ఫస్ట్ టర్మ్ ఫీజులు చెల్లించాలని పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. దీంతో జర్నలిస్టులు తీవ్ర ఆందో ళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఆయా జిల్లా కలెక్టర్లు జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అదే విధంగా పెద్దపల్లి జిల్లాలోనూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలపై జిల్లా యంత్రాంగం వివక్షత, చిన్నచూపు ప్రదర్శిస్తోందని వెన్నంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. కలెక్టర్‌ను కలవడానికి వస్తున్న జర్నలిస్టులను సైతం కలవనివ్వడం లేదని, కలెక్టర్ సీసీలు కూడా జర్నలిస్టులను దగ్గ రకు రానివ్వడం లేదని అన్నారు. గతంలో పెద్దపల్లి జిల్లాలో పనిచేసిన ఏ జిల్లా కలె క్టర్ కూడా జర్నలిస్టుల పట్ల ఈ విధంగా వ్యవహరించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించేలా జిల్లా విద్యాశాఖ అధికారులకు వెంటనే ఉత్త ర్వులు జారీ చేయాలని జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సిరికొండలో భూభారతి కింద భూముల రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

వాస్తవం : ఇల్లంతకుంట

భూ భారతి కింద భూముల రీ సర్వే వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం సిరికొండ గ్రామంలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, గురువారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద



భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన ఎలక్షన్ కార్డులపై గ్రామ సభ



## పాల్గొన్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉమేర్ తహసీల్దార్ ఆదేశాలతో కార్యక్రమ నిర్వహణ

వాస్తవం : వీర్నపల్లి

ఈరోజు బాబాయ్ చెరువు గ్రామంలో ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం లో భాగంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఓటరు జాబితాలో సవరణ, నూతన ఓటర్ల ను ఆన్లైన్ చేయడం ఓటర్ జాబితాలో తప్పులను సరి చేయడం గురించి ఈరోజు గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రెవిన్ ఇన్స్పెక్టర్ ఉమేర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచన ప్రకారం ప్రతి ఒక్కరూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ప్రోగ్రాం ఫామ్ లో సవరణలు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుధాకర్,ఆర్ఐ ఉమర్, ఉప సర్పంచ్ లత సంతోష్, వార్డు సభ్యులు నునావత్ రజిత,భూక్య రజిత ,మాజీ ఉప సర్పంచ్ రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, మహిళలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# పాస్ పోర్ట్ వివరాలు అడగడం విడ్డూరం

వాస్తవం : రాజేంద్రనగర్

ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా తల్లిదండ్రుల వివరాలు పొందుపరిచి మ్యాపింగ్ చేసిన వారికి కూడా నోటీసులు పంపించడం విచిత్రంగా ఉందని మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. దీనికి తోడు నోటీసులలో పాస్ పోర్ట్, పదవ తరగతి సర్టిఫికెట్, మెట్రిక్యులేషన్ ధృవీకరణ పత్రాలను జతపరచమని ఒత్తిడి తేవడం మరి విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పుప్పాలగూడ హరిజన బస్తి, సంతోష్ నగర్ కమ్యూనిటీ హాల్ లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఓటర్ జాబితా సహాయ శిబిరాన్ని నిర్వహించారు. ఓటర్లలో చాలామంది నిరక్షరాస్యులు ఉన్నారని వారు పాస్పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రాలు ఎక్కడినుండి తెస్తారని పార్టీ నాయకులు అధికారులను ప్రశ్నించారు. ఓటర్లకు అందిన నోటీసులలో అడుగుతున్న తాతలు, తల్లిదండ్రు



ల వయసుకు సంబంధించిన వివరాల విషయంలో కూడా గందరగోళం నెలకొందని వారు సూచిస్తున్నారు. సమంజసం కానీ విచారణ పేరుతో ఉన్న కాస్తో కూస్తో ఓట్లను అంతం చేయడానికే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆ పార్టీ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సుమనలిని, సింగదాసరి, గణేష్, శ్రీ బాబు తదితరులు ఆరోపించారు.

# వాగ్దేవిలో ఘనంగా ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రాఖీలు కట్టుకుని అన్నాచెల్లెళ్ల అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలను చాటుకున్నారు. రక్షాబంధన్ పండుగ యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం, రక్షణ భావం ఎల్లప్పుడూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రాఖీ పండగ గురించి ఇంగ్లీషులో ఉపన్యసించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సోదరభావం, ఐక్యత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేలా సాగింది.

# శ్రీకృష్ణ నగర్‌లో ఉన్న శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్ ఆధ్వర్యంలో ర్యాలీ

వాస్తవం : జూబ్లీహిల్స్

వన మహోత్సవ వారోత్సవాలను 1950లో అప్పటి భారత కేంద్ర వ్యవసాయ ఆహార శాఖ మంత్రి కె.మాణిక్ లాల్ మున్షి( కె.ఎం.మున్షి) శ్రీకారం చుట్టారు. అటువంటి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జూబ్లీ హిల్స్ నియోజకవర్గం శ్రీకృష్ణ నగర్ లోని శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా గురువారం "వన మహోత్సవ ర్యాలీ" వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. ర్యాలీని పాఠశాల చైర్మన్ శిరీష భవాని శంకర్ పచ్చని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్ర




ధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ, "వృక్షో రక్షతి రక్షితః", "మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం", "పచ్చని చెట్లు- ప్రగతికి మెట్లు" వంటి నినాదాలతో కూడిన ప్లకార్డుల ను పట్టుకొని వీధుల గుండా ప్రదర్శన చేశారు.

# శాత్రాజ్‌పల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

## వందలాది మందికి నేత్ర పరీక్షలు.. అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్ లు వేములవాడ మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతిరెడ్డి

వాస్తవం: వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని 3 వ వార్డు శాత్రాజ్‌పల్లి గ్రామంలో ఎల్ వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నేత్ర పరీక్షలు చేయించుకు



న్నారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ 2 వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి -తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ....గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మోతి బిందు, శుక్లాలు తదితర సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ లు చేయనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ఎప్పటికప్పుడు నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, ఆర్థమెటిస్ట్‌లు భవాని, నిఖిల్, తదితరులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గుడిసె సదానందం, రేగుల రాజేశం, అయిత వెంకటేశం, ప్రకాష్, బాలయ్య, మెట్ట దేవానంద్,బూర గణేష్, గుడిసె అనిల్ కుమార్, చోటు, మల్లారం తిరుపతి, చందనం రవి, తదితరులు పాల్గొన్నారు.

# కాపర్,అల్యూమినియం వైర్ దొంగలు అరెస్ట్

### 10 కిలోల కాపర్ వైర్,100 కిలోల అల్యూమినియం వైర్, ఆటో స్వాధీనం వివరాలు వెల్లడించిన ఏసీపీ సదానందం




వాస్తవం : హుస్నాబాద్

సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండల పరిధిలో కాపర్, అల్యూమినియం వైర్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను పట్టుకుని రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ సదానందం వెల్లడించారు.కోహెడ మండల శివారులో వెంకటేశ్వరపల్లి, ఆరేపల్లి, బస్వాపూర్ గ్రామ శివారులో ట్రాన్స్ ఫార్మర్ పగలగొట్టి కాపర్, అల్యూమినియం వైర్ లు మరియు తంగళ్ళపల్లి గ్రామాల శివారులో రైతుల వ్యవసాయ పొలాల వద్ద గల కరెంట్ మోటార్ వైర్ లు దొంగతనాలకు పాల్పడుతున్న కరీంనగర్ జిల్లా సోమారం గ్రామానికి చెందిన లోకిని మహేష్, హన్మకొండ గోకుల్ నగర్ కు చెందిన దేవర రాజశేఖర్ లు గురువారం దొంగతనం చేసిన కాపర్ వైర్ లను వారితో పాటు తెచ్చుకున్న ప్యాసెంజర్ ఆటోలో తీసుకువస్తుండగా కోహెడ పోలీస్ లు సముద్రాల గ్రామం ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకొని వారి వద్ద నుండి ప్యాసింజర్ ఆటో, 10 కిలోల ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్,100 కిలోల అల్యూమినియం వైర్ స్వాధీనం చేసుకున్నారు. కాగా కొందరు దొంగలు పరారీలో ఉన్నారని వెల్లడించారు.చోరీ కేసు చేదనలో ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ సీఐ శ్రీధర్, కోహెడ యస్.ఐ అభిలాష్, హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ వేణు లను హుస్నాబాద్ ఏసిపి సదానందం అభినందించారు.

# విద్యా భారతి పాఠశాలలో ఘనంగా ముందస్తు రక్షాబంధన్



వాస్తవం : నిర్మల్

నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో రక్షాబంధన్ ఉత్సవాలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పురంశెట్టి లింగయ్య మాట్లాడుతూ "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా"ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కూడా ఉంటారని, స్త్రీకి ఇచ్చేటటువంటి గౌరవంతో పాటు, సోదరీ సోదర భావము గురించి ప్రత్యక్షంగా రాఖీ పండగ ద్వారా మనకు తెలుస్తుంది అన్నారు. మన సంప్రదాయంలో ప్రతి శుభకార్యంలో కూడా మనం ధారణ చేసే కంకణం ఒక వ్యక్తి తన లక్ష్యాన్ని చేరుకోవడంలో కంకణ బద్ధులై ఉండడాన్ని సూచిస్తుంది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు' 'నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనిద్దరం దేశానికి రక్షా అని అనుకుంటూ రాఖీలు కట్టుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతన్న, లక్మ.మధుసూదన్, సాయినాథ్, రాజు, దేవకి, సరస్వతి, సరోజన, కవిత, నేహా, పద్మ, గంగ వేణి, శృతిక, లక్ష్మి, గంగామణి, భువనేశ్వరి, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటుకు నాయకుల పిలుపు



వాస్తవం : మద్దూరు

ఎమ్మార్పీఎస్ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మద్దూరు మండలం లద్నూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మల్లిగారి యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొని నాయకులతో పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఈ నెల 29న శనివారం మద్దూరు మండల కేంద్రంలో మండల సమావేశం నిర్వహించి నూతన మండల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.సమావేశంలో మండల ఇన్‌చార్జి పాకాల ఇసాక్, గ్రామ అధ్యక్షులు కొమ్ము భాస్కర్, మాజీ సర్పంచులు జీడికంటి సుదర్శన్,రామడుగు బాలరాజు, మండల నాయకులు గాదపాక కుమార్, సీనియర్ నాయకులు మంద యాదయ్య, జీడికంటి రాజ్‌కుమార్, జీడికంటి జోసెఫ్, రామడుగు బాలయ్య, కొమ్ము యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# 75 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



వాస్తవం : పటాన్ చెరు

ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం కి చెందిన బొంత తరుణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 75 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని గురువారం పటాన్ చెరు లోని తన కార్యాలయంలో తరుణ్ కుటుంబ సభ్యులకు అందచేశారు.ఈకార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌విజయ్ కుమార్,పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో వినూత్నంగా వృక్ష రక్షాబంధన్ కార్యక్రమం



వాస్తవం : హుస్నాబాద్

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వినూత్నంగా వృక్ష రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ... వృక్షో రక్షతి రక్షితః అంటూ వృక్షాలను మనం కాపాడినట్లైతే అవి మనల్ని కాపాడతాయని, పర్యావరణ సమతుల్యతకు వృక్షాన్ని ఆధారమని తెలిపారు. విచక్షణారహితంగా అడవులను నరికి వేయడం వలన, అనేక దుష్పలితాలను ఎదుర్కొంటున్నామని, పర్యావరణ కాలుష్యం, తక్కువ వర్షపాతం అనిశ్చితమైన వాతావరణ మార్పులకు అడవుల నరికివేత ప్రధాన కారణమని తెలిపారు. కళాశాల ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదగా నాటిన 150 మొక్కలను సంరక్షించే బాధ్యతను జాతీయ సేవ పథకం వాలంటీర్లు చేపడుతున్నారని వారిని అభినందించారు. వాలంటీర్లందరూ తమ నాటిన చెట్లకు రాఖీలను కట్టడం ద్వారా ప్రతి ఒక్కరూ ఒక్కొక్క చెట్టును పెంచే బాధ్యతను తీసుకున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. నైనా దేవి పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని తెలుపుతూ, విద్యార్థులు కళాశాల ఉద్యానవనానికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, బాలరాజు, కుమారస్వామి, శ్రీనివాస్, రమేష్, షబీ ఫాతిమా,విజయ,సుధా మాధురి,విద్యార్థులు పాల్గొన్నారు.

JSS JOURNALISTS SANKSHEMA SANGAM
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110



# ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



వాస్తవం : సిరిసిల్ల

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ రక్షాబంధన్ ప్రాముఖ్యతను సోదర,సోదరి మణుల అనుబంధాన్ని వివరించారు.అనంతరం విద్యార్థులందరు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని,నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష, మనందరం దేశానికి రక్ష అంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నందిని, లావణ్య, లక్ష్మీనరసింహస్వామి, వేద ప్రకాష్ జోషి, ప్రసన్న రాణి, కరుణ, రూప తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి మండల వ్యాప్తంగా ముందస్తు రాఖీ వేడుకలు



వాస్తవం : బెజ్జంకి

బెజ్జంకి మండల వ్యాప్తంగా గురువారం ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో, బేగంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీ కట్టి తమ సోదర భావాన్ని చాటుకున్నారు. బేగంపేట పాఠశాల విద్యార్థులు పచ్చని ఆకులతో రాఖీలు తయారుచేసి పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు సవివరంగా వివరించారు.ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 12వ వార్డులో సర్ ప్రక్రియ తప్పుల ఏరివేత



## హాజరైన కౌన్సిలర్, కమిషనర్

వాస్తవం : అందోల్

సర్ ప్రక్రియ తప్పుల ఎరివేతులను పకడ్ బందీగా నిర్వహించారు. అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో ఇటీవల సర్ ప్రక్రియ లో నిర్వహించిన పొరాలలో తప్పులు పడ్డాయని వాటిని సరి చేయడానికి 12వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి కమిషనర్ తిరుపతిల ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. ఇందులో ఎన్నో తప్పులు దొర్లాయన ఈ క్యాంపులో సరి చేశారు. వందలాదిమంది ఓటర్లు తమ పేర్ల నమోదు సరి చేయడం కోసం గంటల తరబడి కూర్చుని సర్ది చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడు కౌన్సిలర్ సరస్వతి,, కమిషనర్ తిరుపతి మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నస్పూర్ ఐడిఓసి వద్ద మహాధర్నా



వాస్తవం : జైపూర్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం మంచిర్యాల జిల్లా టిజిఈజెఎసి ఆధ్వర్యంలో గురువారం నస్పూర్ ఐడిఓసి వద్ద మహాధర్నా నిర్వహించారు.రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పిలుపు మేరకు జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. ఐడిఓసి ముఖద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న 6 విడతల డీఏలను విడుదల చేయాలని, ఈహెచ్ ఎస్ ను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి నెల 2 వేల కోట్లు విడుదల చేసి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, సీపీఎస్ సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగ సంఘాలకు గుర్తింపు కల్పించాలని తీర్మానించారు.సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరపకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో టిజిఈజెఎసి అదనపు సెక్రటరీ జనరల్,కో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వివిధ సంఘాల నాయకులు, జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన సుమారు 4,500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చేతులతో రాఖీ తయారీ

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



వాస్తవం : వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యోరుపల్లి మండల పరిషత్ పాఠశాలలో గురువారం రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు స్వయంగా తయారుచేసిన రాఖీలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తి, సృజనాత్మకతతో తయారుచేసిన రాఖీలను కౌన్సిలర్ గుడిసె సంతోష పరిశీలించి, విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గుడిసె సంతోష విద్యార్థులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, స్వయంకృషి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆమే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మూడో వార్డు ఆఫీసర్ రాజు, ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టరు శ్రీ హేమకళ, మంజుల, ప్రధానోపాధ్యాయులు బారాజు రమణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు రక్షబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సోదరులు సోదరీమణులకు రాఖీలు కట్టారు. స్వీట్లు పంపిణీ చేశారు. అక్క చెల్లెల బంధం అన్యోన్యతకు రాఖీ ప్రతీక అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వికుర్తి లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద మహిళ వైద్యానికి ఎంపీ ఈటల చేయూత

## రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు



వాస్తవం : మనోహరాబాద్

పేదల వైద్యానికి చేయూత అందించడంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముందుంటున్నారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్ తెలిపారు.మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ హసీనా బేగం అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆమె మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అవసరమని గుర్తించిన ఎంపీ ఈటల రాజేందర్ రూ. 2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు.ఈ ఎల్ఓసీ పత్రాన్ని గురువారం బాధితురాలి కుటుంబ సభ్యులకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్,మనోహరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ లు అందజేశారు.సీఎంఆర్ఎఫ్,ఎల్ఓసీల ద్వారా పేదలకు సకాలంలో వైద్య సహాయం అందేలా ఎంపీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని నాయకులు పేర్కొన్నారు.బాధితురాలి కుటుంబ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కరాటే మల్లేష్ ముదిరాజ్,ఉసిరికపల్లి రాజు,మహేష్ గౌడ్,భాస్కర్,బాలరాజు,శ్రీకాంత్ గణేష్,నాగేష్,షాదుల్లా,ఎండి సలుద్దిన్,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# సిద్ధార్థలో ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు



వాస్తవం : చెన్నారావుపేట

కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్లో రక్షాబంధన్ వేడుకలను ముందస్తుగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు అనంతరం పాఠశాల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ కాలం నుండి రక్షాబంధనం జరుపుకోవడం జరుగుతుందన్నారు. సోదర సోదరీ బంధుత్వానికి ప్రతీక రాఖీ పండుగ అని అన్నారు. అనంతరం పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డి. ప్రిన్సిపాల్ అందేశీ కరుణాకర్ రెడ్డి. మేడి రమేష్ గౌడ్. ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు